# జన చైనా- నవ నాయకత్వం

**ప్రపంచ జనాభాలో ప్రథమ, ఆర్థిక వ్యవస్థలో ద్వితీయ స్థానం ఆక్రమించిన చైనా అధికార పగ్గాలు కొత్తతరం చేతుల్లోకి వెళ్లాయి. పదేళ్లకోసారి జరిగే అధికార మార్పిడిలో భాగంగా నూతన అధ్యక్షుడిగా జి జిన్‌పింగ్ ఎన్నికయ్యారు. హు జింటావో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను కొనసాగించడంతోపాటు అవినీతి, పెరుగుతున్న ధనిక-పేద అంతరాలు, సరిహద్దు దేశాలతో సంబంధాలు నూతన నాయకత్వానికి సవాల్ విసురుతున్నాయి.**

కమ్యూనిస్టు చైనాలో కొత్తతరం నాయకత్వం అంకురించింది. బీజింగ్‌లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ(సీపీసీ) 18వ మహాసభ దేశాన్ని నూతన నాయకత్వం చేతిలో పెట్టింది. సీపీసీ నిబంధనావళి ప్రకారం అత్యున్నత నాయకత్వ బృందం పదేళ్లకోసారి మారుతుంది. ఈ కాంగ్రెస్‌లోని దాదాపు 2,268 మంది ప్రతినిధులు 376 మందితో కొత్త కమిటీ (205 మంది సెంట్రల్ కమిటీ సభ్యులు, 171మంది ప్రత్యామ్నాయ సభ్యులు)ని ఎన్నుకొంది. ఈ కమిటీ 25 మంది సభ్యులు గల పొలిట్‌బ్యూరోను, మరో ఏడుగురితో కూడిన అత్యున్నత విధాన నిర్ణాయక స్టాండింగ్ కమిటీని, పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌పీ)ని నియంత్రించే సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ)ని నియమించింది. పార్టీ ప్రధాన కార్య దర్శిగా, దేశ నూతన అధ్యక్షుడిగా జి జిన్ పింగ్ (59), ప్రధానిగా లీ కెకియాంగ్ ఎన్నికయ్యారు. మావో పంథా నుంచి దేశ ఆర్థిక విధానాన్ని పక్కకు తప్పించి నూతన సంస్కరణలకు ఆద్యుడిగా నిలిచిన ప్రస్తుత అధ్యక్షుడు హు జింటావో, ఇప్పటికీ పార్టీలో ప్రభావం చూపుతున్న జియాంగ్ జెమిన్ వర్గాల మధ్య పోరు నడిచింది. చివరకు హు జింటావో వర్గానిదే పైచేయి అయ్యింది. వచ్చే ఏడాది మార్చిలో నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పీసీ) సమావేశం తర్వాత కొత్త నాయకత్వం అధికారాన్ని చేపడుతుంది.

**మలుపు తిప్పిన హు జింటావో పాలన:** 2002లో అధికారాన్ని చేపట్టిన హు జింటావో చైనాను అభివృద్ధి పథంలో పరుగులెత్తించారు. మావో సోషలిస్టు విధానాలను పక్కనబెట్టి అధ్యక్షుడు డెంగ్ జియావోపింగ్ 1979లో తొలిసారిగా ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటుతో చైనా తరహా సామ్యవాద మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు గట్టి పునాదులు వేస్తే.. ఆర్థిక సంస్కరణలతో హు జింటావో మరింత వేగం పెంచారు. జీడీపీలో గణనీయమైన పురోగతి సాధించేలా చేశారు. ఆయన పగ్గాలు చేపట్టిన 2002లో చైనా ఆర్థిక వ్యవస్థ గొప్పగా లేదు. హు జింటావో హయాంలోనే చైనా ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరింది. ఆ వ్యవస్థను దేశీయ ప్రగతికి ఆలంబనగా చేసుకున్నారు జింటావో. విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో దేశాన్ని ముందు వరసలో నిలిపారు. ఈయన హయాంలోనే చైనా అంతరిక్షంలో పలు విజయాలు సాధించింది. నభూతో నభవిష్యతి అనే రీతిలో ఒలింపిక్స్‌ను నిర్వహించింది. మొదటిసారిగా రైతులకు పింఛన్లు, వైద్య బీమా అందించారు. ఆధునిక, సంపన్న సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా 2020-మార్గదర్శక ప్రణాళికను ఆవిష్కరించారు. మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దారిద్ర్యాన్ని 2015 నాటికి సగానికి తగ్గించుకోవాలన్న ఐక్యరాజ్యసమితి సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాన్ని సాధించిన

తొలి దేశంగా చైనా చరిత్ర సృష్టించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, జాతీయ సహజ వనరులు, చౌక శ్రమశక్తితో అనుసంధానించి ఎగుమతి ఆధారిత ఆర్థిక విధానాల ద్వారా హు దేశాన్ని ముందుకు నడిపించారు. ముఖ్యంగా యూరప్ బహుళజాతి సంస్థల మదుపు కేంద్రంగా సరోగేట్ ఆర్థిక వ్యవస్థగా చైనాను మార్చారు. వాణిజ్య మిగులు, అభివృద్ధి రేటు రూపంలో సంపద పెరిగేలా చేశారు. సీపీసీ 18వ కాంగ్రెస్.. మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానం, డెంగ్ సిద్ధాంతం, జియాంగ్ జెమిన్ భావనల ప్రాధాన్యాన్ని గుర్తించడానికి తోడు 'అభివృద్ధిలో శాస్త్రీయ దృక్పథం' ఉండాలన్న హు జింటావో వైఖరి కూడా పార్టీ నియమావళిలో చేర్చింది.

**తరుముకొస్తున్న అవినీతి:** హు జింటావో తెచ్చిన ఆర్థిక సంస్కరణలు, అభివృద్ధి దేశానికి అవినీతి వైరస్‌ను అంటించాయి. ఈ కాంగ్రెస్‌లో హు జింటావో తన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. 'ఈ సమస్యను మనం సరిగా పరిష్కరించకపోతే పార్టీ ఉనికికే ప్రమాదం వస్తుంది. పార్టీ కుప్పకూలుతుంది. మన రాజ్యం దెబ్బతింటుంది.' అని తీవ్ర స్వరంతో చెప్పారు. అంతేకాదు, 'స్వయం క్రమశిక్షణపై శ్రద్ధ వహించండి. పార్టీ క్రమశిక్షణను, రాజ్య చట్టాలను అతిక్రమించినవారెవరైనా, ఏ స్థాయి వారైనా సరే ఉపేక్షించరాదు. ఎలాంటి దయాదాక్షిణ్యాలు లేకుండా వారిపై న్యాయవిచారణ చేపట్టాలి' అని స్పష్టం చేశారు. దీన్ని బట్టి ఆ దేశంలో అవినీతి ఎంత ప్రమాదకరంగా తయారవుతుందో అర్థమవుతోంది. మొన్నటిదాకా ప్రధానమంత్రిగా ఉన్న వెన్ జియాబావో కుటుంబ సభ్యులు 270 కోట్ల డాలర్ల మేరకు కార్పొరేట్ ఆస్తులు కూడబెట్టారని 'న్యూయార్క్‌టైమ్స్' ఇటీవల ఓ కథనం వెలువరించింది. అంతే కాదు, ఏటా 19వేల డాలర్లు సంపాదించే మధ్యస్థాయి ప్రభుత్వ భద్రతాధికారి ఒకరు 60 లక్షల డాలర్లకు పైగా విలువచేసే 21 భవనాలు సమకూర్చుకొన్నారు. అత్యున్నత స్థాయి పాలకవర్గమైన పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుల బంధువులు చమురు, టెలికమ్యూనికేషన్లు, పొగాకు, వినియోగ వస్తువుల రంగాల్లోకి ప్రవేశించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**లక్ష్యం ఒకటి.. జరిగింది మరొకటి:** ఒక్కో మెట్టు సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధించాలన్న సాంప్రదాయక చైనా కమ్యూనిస్టు పార్టీ వైఖరికి భిన్నంగా అసమానతలతో కూడిన ప్రగతి అవతరించింది. ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య, తీర, ఎగువ ప్రాంతాలు, వ్యక్తుల మధ్య అంతరాలు విపరీతంగా పెరిగాయి. పర్యావరణ, ప్రజారోగ్యం, సామాజిక భద్రత వంటి విషయాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పల్లెల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ్గాలేవు. 25కోట్ల వలస కార్మికులు నగరాల్లో ద్వితీయ శ్రేణి పౌరులుగా దుర్భర జీవితాలు గడుపుతున్నారు. వారికి స్థానిక నివాస పర్మిట్లు లేవు. దీంతో పిల్లల్ని బడిలో చేర్పించే అవకాశాన్ని కోల్పోతున్నారు. వలస కార్మికులతో నగరాలు కిక్కిరిసిపోతున్నాయి. 2002లో 39.1 శాతం ఉన్న పట్టణ జనాభా 2011లో 50 శాతానికి చేరింది. జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేయడంపై ప్రజల్లో కొంత నిరసన వ్యక్తమవుతోంది. చైనా నూతన నాయకత్వం తక్షణం దృష్టి సారించాల్సిన మరో కీలక సమస్య ఇది. ఇక టిబెట్, జిన్‌జియాంగ్, ఉగెర్ వంటి మైనార్టీ ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న అసంతృప్తి జ్వాలలు నాయకత్వానికి నిద్రలేకుండా చేసే అంశాలే.

## భారత్‌తో సంబంధాలు:

చైనా-భారత్ సంబంధాలు ఇటీవల కొంత మెరుగుపడ్డాయి. 1950 దశకంలో భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 'హిందీ-చీనీ భాయ్‌భాయ్' అనే నినాదంతో పంచశీలను ప్రతిపాదించారు. 1954లో భారత్-చైనా ఒడంబడిక కుదిరింది. అయితే ఆ వెంటనే 1958, 59ల్లో లడఖ్, అరుణాచల్‌ప్రదేశ్‌ల్లో పలుచోట్ల సైనిక చొరబాట్లకు చైనా పాల్పడింది. దలైలామా టిబెట్‌ను వదిలి భారత్ రావడం, మెక్‌మోహన్‌రేఖకు దక్షిణంగా లాంగ్జులో భారత సైనిక స్థావరాన్ని చైనా ఆక్రమించడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడం మొదలైంది. 1961లో సరిహద్దుల రక్షణకు 'ఫార్వర్డ్ పాలసీ' పేరిట నెహ్రూ 43 స్థావరాలను ఏర్పాటుచేశారు. అప్పటి చైనా అధ్యక్షుడు మావో జెడాంగ్ స్వదేశంలో పట్టు కోల్పోతుండడంతో భారత్‌తో యుద్ధం ద్వారా తన ప్రతిష్ఠ పెంచుకోవాలని తలచి 1962 సెప్టెంబరు 8న మెక్‌మోహన్ రేఖ ఉత్తరాన భారత్ సైనిక స్థావరం మీద దాడి చేయించారు. దీంతో యుద్ధానికి తెరలేచింది. అదే ఏడాది అక్టోబరు 20న పూర్తిస్థాయి యుద్ధానికి ఒడిగట్టింది. నవంబరు 14న చైనా దళాలు భారత సరిహద్దుల్లో తూర్పున బోమిల్లాపైనా, పశ్చిమాన చుషుల్‌పైనా దాడిచేసి ఆక్రమించాయి. నవంబర్ 21న ఏకపక్షంగా చైనా కాల్పుల విరమణ చేసింది. అప్పటి వివాదాస్పద ప్రాంతాల మీద ఇంకా ఓ పరిష్కారానికి రాలేదు. 1972లో ఈశాన్య సరిహద్దు ఏజెన్సీ ప్రాంతానికి అరుణాచల్‌ప్రదేశ్‌గా భారత్ పేరుపెట్టింది. చైనా మాత్రం దాన్ని దక్షిణ టిబెట్‌గానే ఇప్పటికీ వ్యవహరిస్తోంది. మరో వైపు 1976లో రెండుదేశాలు దౌత్య సంబంధాలు నెలకొల్పుకున్నాయి. 1978లో అధికారికంగా వాణిజ్యం మొదలైంది. 1981లో సరిహద్దు వివాదంపై ఎనిమిదిరౌండ్లు చర్చలు జరిగాయి. 1986లో అరుణాచల్‌ప్రదేశ్‌లోని సుమడోరోంగ్‌చు లోయలో మళ్లీ చైనా సైన్యాన్ని మోహరించింది. అదే ఏడాది అరుణాల్‌ప్రదేశ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించింది. 1988లో రాజీవ్‌గాంధీ చైనాలో పర్యటించారు. 1993లో వాస్తవాధీన రేఖను నిర్వచించేందుకు ఒక బృందాన్ని ఏర్పాటుచేశారు. సైనిక రంగంలో విశ్వాస పునరుద్ధరణకు ఒప్పందం కుదిరింది. 1998 మే నెలలో పోఖ్రాన్ అణు పరీక్షలతో మళ్లీ సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే 2003లో వాస్తవాధీన రేఖ అంశంపై ప్రతినిధుల స్థాయి చర్చలు మొదలయ్యాయి. 2009లో అరుణాల్‌ప్రదేశ్‌పై మళ్లీ చైనా దుమారం రేపింది. అక్కడ భారత ప్రధాని మన్మోహన్‌కు పర్యటించే హక్కులేదని ప్రకటించింది. ఒక పక్క సరిహద్దు వివాదం కొనసాగుతున్నా.. ద్వైపాక్షిక వాణిజ్యం కొనసాగుతూనే ఉంది. చైనా వస్తువులకు భారత్ ప్రధాన వినియోగ కేంద్రంగా మారింది. బ్రహ్మపుత్రా నది విషయంలోనూ భారత్‌తో గొడవ పెట్టుకుంది. అంతర్జాతీయ న్యాయసూత్రాలు విస్మరించి నదిపై ఆనకట్టలు కట్టి నీటిని, నదీ గమనాన్ని మళ్లించుకోవాలని చూస్తోంది. ఫలితంగా భారత్, బంగ్లాదేశ్‌లకు ఈ నదీ ప్రవాహం తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. భారత సరిహద్దుల్లో టిబెట్‌లో రోడ్డు, రైలు మార్గాల్ని నిర్మించింది. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్(పీవోకే)లో రవాణా మార్గాలు, ఇతర మౌలిక సౌకర్యాల కల్పన చేపట్టింది. దీనివల్ల కాశ్మీరు ఉత్తర సరిహద్దు ప్రాంతాలతో చైనాకు సంబంధాలు ఏర్పడ్డాయి.

**పీబీఎస్‌సీ విశిష్టత:** చైనా పాలనా వ్యవహారాలలో కీలకపాత్ర వహించేది, మార్గనిర్దేశనం చేసేది చైనా కమ్యూనిస్టు పార్టీకి చెందిన అత్యున్నత పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ(పీబీఎస్‌సీ). ఆర్థిక, రాజకీయ, విదేశీ సహా అన్ని విధానాల నిర్ణయాలలో దీనిదే కీలకపాత్ర. ఈసారి ఈ కమిటీలో విప్లవ నేపథ్యం ఉన్న వారే ఎన్నికైనా.. మహిళలు, మైనార్టీలకు ప్రాధాన్యత లేకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ కమిటీకి ఎన్నికైన ఏడుగురు..జి జిన్ పింగ్(ప్రధాన కార్యదర్శి, దేశాధ్యక్షుడు), లీ కెకియాంగ్(ప్రధాని), జాంగ్ డీజి యాంగ్(ఉప ప్రధాని), యూజెంగ్ షెంగ్, వీయూ యున్‌షాన్, వాంగ్ కి షాన్, జాంగ్ గోలీ.

జి జిన్ పింగ్ ప్రభావవంతమైన రాజకీయ, విప్లవ కుటుంబంలో 1953లో జన్మించారు. కెమికల్ ఇంజినీరింగ్ చదివారు. తండ్రి జీ జోంగ్ జన్ చైనా విప్లవనేతగా ప్రసిద్ధుడు. మావోజెడాంగ్ హయాంలో మంత్రిగా పనిచేశారు. చౌఎన్‌లై ప్రధానిగా ఉన్నప్పుడు ఉపప్రధానిగా వ్యవహరించారు. పింగ్ 1966-76 సాంస్కృతిక విప్లవంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన సతీమణి జానపద గాయని పింగ్ వియునాన్‌కు విశేష ప్రజాదరణ ఉంది. జిన్ పింగ్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి 2008లో చైనా ఉపప్రధానిగా ఎన్నికయ్యారు. హు జింటావో రాజకీయ వారసుడిగా ఉన్న 57 ఏళ్ల లీ కెకియాంగ్ ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. లా చదివారు. 1998లో హెనాన్ రాష్ట్ర పార్టీకి ఉప కార్యదర్శిగా, 1999లో ఆ రాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు.

**చైనా చరిత్ర:** ప్రాచీన ప్రపంచ నాగరికతల్లో చైనాకు ప్రముఖ స్థానం ఉంది. దేశాన్ని మూడు ముఖ్య భౌగోళిక భాగాలుగా విభజిస్తారు. అవి 1. హువాంగ్ హో నదీలోయ 2. యాంగ్ జీ నదీలోయ 3. దక్షిణ చైనా. ప్రాచీన నాగరికత హువాంగ్ హో, దాని ఉపనది వే నదీలోయలో విలసిల్లింది. చైనాను షాంగ్ రాజ వంశం(క్రీస్తుపూర్వం 1450-1050) ప్రథమంగా పాలించింది. ఆ తర్వాత చౌ వంశం క్రీస్తుపూర్వం 256 వరకు పాలించింది. చైనా దార్శనికులైన లౌత్సే, కన్ఫూషియస్ ఈ కాలంలోని వారే. చౌ వంశ పరిపాలన చివరకు కలహయుగంగా పేరుతెచ్చుకుంది. దేశం వెయ్యి చిన్న రాజ్యాలుగా విడిపోయింది. ఈ పరిస్థితుల్లో చైనా వాయువ్య దిశలోని చిన్ రాజ్యం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. షి హువాంగ్ దీ చైనా చక్రవర్తి అయ్యారు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను ఆయనే కట్టించాడు. తన వంశం పేరైన చిన్ శబ్దాన్నే దేశం పేరుగా వాడుకలోకి తెచ్చాడు. చిన్ శబ్దం నుంచే చైనా వచ్చింది. చిన్, హన్ రాజవంశాల తర్వాత క్రీస్తుశకం 589 వరకు ఆరు రాజవంశాలు పాలించాయి. ఈ కాలానికే లూజౌ అనే పేరు ఉంది. ఈ కాలంలో నాన్‌కింగ్ రాజధానిగా ఉండేది. 13వ శతాబ్దంలో చైనా మంగోలుల వశమైంది. 1368 నుంచి 1644 వరకు మింగ్ వంశం పాలించింది. వీరే రాజధానిని పెకింగ్‌కు మార్చారు. ఆ తర్వాత మంచూలు ఆక్రమించారు. చైనా రాజకీయాల్లో ప్రధాన పాత్ర వహించిన రాజమాత 1908 నవంబరు 15న మరణించడంతో చున్ కుమారుడు మూడేళ్ల పూయి చక్రవర్తి అయ్యాడు. రాజకీయ సంస్కరణలు కోరుతున్న వర్గానికి డాక్టర్ సన్‌యట్ సేన్ నాయకత్వం వహించి విప్లవ బీజాలు నాటాడు. చివరకు 19 12 ఫిబ్రవరి 12న చక్రవర్తి పదవీ త్యాగం చేశాడు. చైనా రిపబ్లిక్‌కు యువాన్‌షికై అధ్యక్షుడయ్యాడు. ఆయన మరణానంతరం తిరిగి వచ్చిన సన్‌యట్ సేన్ 1921లో చైనా గణతంత్ర ప్రభుత్వానికి అధ్యక్షుడయ్యారు. కొమింగ్‌టాన్ జాతీయ ప్రజాపక్షాన్ని ఆయన స్థాపించారు. 1924లో

కొమింగ్‌టాన్‌లోకి కమ్యూనిస్టులు ప్రవేశించారు. సన్‌యట్ మరణం తర్వాత చియాంగ్ కై షేక్ నాయకత్వానికి వచ్చాడు. రైతుల గురించి పట్టించుకోకపోవడంతో ఆయన పాలనపై అసంతృప్తి రేగింది. జపాన్ చైనాపై దాడి చేసింది. ఈ దశలో మావోసేటుంగ్ నాయకత్వంలో తిరుగుబాటు తలెత్తింది. 1949 అక్టోబరు 1న కమ్యూనిస్టు చైనా ప్రజా గణతంత్ర రాజ్యం (చైనీస్ పీపుల్స్ రిపబ్లిక్)గా అవతరించింది.

## భారత్-చైనాల అభివృద్ధిలో తేడాలు

1. స్థూలజాతీయోత్పత్తి భారత్‌లో కంటే చైనాలో నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. తలసరి జీడీపీలో మూడు రెట్లు ఎక్కువ. విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో రెండు దేశాల మధ్య పోలికే లేదు.

2. చైనాలో పేదలు 3 శాతం ఉంటే.. భారత్‌లో 40 శాతం మంది ఉన్నారు. మూడు దశాబ్దాల్లో పేదల సంఖ్యను 25 కోట్ల నుంచి 2.7 కోట్లకు చైనా తగ్గించింది.

3. భారత్ వద్ద ఒక్క అణు జలాంతర్గామి ఉంటే.. చైనా వద్ద 30కిపైగా ఉన్నాయి. చైనా జీడీపీలో ఏడు శాతం రక్షణ రంగానికి కేటాయిస్తే.. భారత్ 2.3శాతానికే పరిమితమైంది.

www.sakshieducation.com